నమస్తే తెలంగాణ





సోమవారం వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

## ఖమ్మంలో ఎర్రబంగారం ధర 20,850

- ఖమ్మం, వరంగల్ మార్కెట్లకు పోటెత్తిన మిర్చి

ఖమ్మం వ్యవసాయం/కాశీబుగ్గ, ఫిబ్రవరి 19: ఖమ్మం వ్యవసాయ, వరంగల్‌లోని ఎనుమాముల మార్కెట్లకు మిర్చి బస్తా లు పోటెత్తాయి. ఆదివారం సెలవు దినం కావడం.. సోమవారం మార్కెట్లలో క్రయవిక్రయాలు ప్రారంభం కావడంతో జిల్లా రైతులతోపాటు పొరుగు జిల్లాలు, ఏపీ రాష్ట్రం నుంచి దాదాపు లక్షల బస్తాల మిర్చిని విక్రయానికి తరలించడంతో యార్డులు పూర్తిగా నిండిపోయాయి. జాతీయ మార్కె ట్లో మంచి ధర పలుకుతుండటంతో స్థానిక వ్యాపారులు పోటీ పడి పంట కొనుగోలు చేశారు. జెండా పాటలో మిర్చి పంట గరిష్ఠ ధర క్వింటాల్‌కు రూ.20,850 పలికింది. మధ్య రకం ధర రూ.19 వేలు, కనిష్ఠ ధర రూ.14 వేలు పలికింది. తాలు రకం పంట కు క్వింటాల్ రూ.12 వేల గరిష్ఠ ధరతో వ్యాపారులు పంటను కొనుగోలు చేశారు. వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో తేజ రకం మిర్చికి అత్యధికంగా క్వింటాల్‌కు రూ.21 వేలు, కనిష్ఠంగా రూ.14 వేలు, వండర్‌హాట్ అత్యధికంగా రూ.21,500, కనిష్ఠంగా రూ.16 వేలు, యూఎస్ 341 రూ.20,500, కనిష్ఠంగా రూ.14 వేలు, దీపిక రకం మిర్చి అత్యధికంగా రూ.20 వేలు, కనిష్ఠంగా రూ.13 వేలు, దేశీ రకం మిర్చి అత్యధికంగా రూ.38, 500, కనిష్ఠంగా రూ.30 వేలు, తాలు ర కం మిర్చి రూ.8,500, కనిష్ఠంగా రూ.5,000 పలికినట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి.



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో పసుపు

## పసుపు క్వింటా @13,006

మెట్‌పల్లి, ఫిబ్రవరి19: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పసుపు క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.13,006 పలికింది. మార్కెట్‌లో పసుపు క్రయ, విక్రయాలు జోరుగా సాగాయి. పసుపు కాడి (కొమ్ము)కి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.13,006, కనిష్ఠంగా రూ.5,112, పసుపు గోళ (మండ) క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.11,316, కనిష్ఠంగా రూ.4,012, పసుపు చూర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.10,122, కనిష్ఠంగా రూ.8,666 పలికింది. పసుపు కాడికి గరిష్ఠంగా రూ.13,006 ధర పలకడం ఈ సీజన్‌లో ఇదే తొలిసారి. ఇప్పటి వరకు మార్కెట్‌లో 1082 క్వింటాళ్ల పసుపు క్రయవిక్రయాలు జరిగినట్టు మార్కెట్ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

# మేడారంలో మద్యం దందా!

- రెట్టింపు ధరలకు విక్రయాలు
- అందిన కాడికి సిండికేట్ దోపిడీ
- యథేచ్ఛగా కల్తీ మద్యం అమ్మకాలు
- మామూళ్ల కిక్కులో ఎక్సైజ్ శాఖ

ములుగు, ఫిబ్రవరి19 (నమస్తేతెలంగాణ): మేడారం మహా జాతరలో మద్యం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతున్నది. తల్లుల దర్శనానికి వచ్చే భక్తులకు మద్యం అంటగట్టేందుకు ఎక్సైజ్ శాఖ అమ్మకాలకు టార్గెట్లు ఫిక్స్ చేసింది. కద్దుండి గుడ్డి వారివలె విధులు, నిబంధనలను గాలికొదిలి అధిక రేట్లకు మద్యాన్ని విక్రయించే వ్యాపారులతో అధికారులు అంటకాగుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి తనివితీరా మొక్కులు చెల్లించిన అనంతరం పరిసర ప్రాంతాల్లో చుక్క, ముక్కకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ ఉంటారు. ఆకాశాన్నంటే ధరలకు మద్యాన్ని అమ్ముతూ వ్యాపారులు భక్తులను నిలువునా దోచుకుంటున్నారు. వ్యాపారులు ఇచ్చే మామూళ్ల మత్తులో తేలాడుతూ ఎక్సైజ్ అధికారులు విధులను మమ అనిపిస్తున్నారు. దీనికి తోడు కల్తీ మద్యాన్ని సైతం భక్తులకు అంటగడుతున్నారు. స్పిరిట్ కలిపిన మద్యాన్ని యథేచ్ఛగా అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ కల్తీ మద్యం తాగిన ఎందరో అనారోగ్యాల బారిన పడుతున్నారు.

### జాతర పరిసరాల్లో వందలాది బెల్ట్ దుకాణాలు

తాడ్వాయి మండలంలో అధికారికంగా నాలుగు మద్యం షాపులే ఉన్నాయి. మేడారం జాతర పరిసర ప్రాంతాల్లో మాత్రం వందలాది బెల్ట్ షాపులు వెలిశాయి. మేడారంలోని మద్యం దుకాణంలో ఒక్కో బీరుకు, ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు రూ.25 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. అది కూడా వారికి నచ్చిన, లాభాలు ఎక్కువ ఉన్న మద్యాన్ని మాత్రమే విక్రయిస్తున్నారు. బెల్ట్ షాపు నిర్వాహకులు మాత్రం ఒక్కో క్వార్టర్‌కు, బీరుకు రూ.100 చొప్పున అదనపు ధరతో అమ్మకాలు సాగిస్తూ దోచుకుంటున్నారు.



మేడారంలో విక్రయిస్తున్న మద్యం

### సిండికేట్ మాయాజాలం

జాతరలో మద్యాన్ని విక్రయించే వ్యాపారులు అధికారుల అండతో సిండికేట్ అవతారం ఎత్తారు. ఒక దగ్గర మద్యం ధర నచ్చక మరో బెల్ట్ దుకాణానికి వెళ్లిన భక్తుడికి నిరాశే ఎదురవుతున్నది. ఎమ్మార్పీ కంటే రూ.10 లేదా రూ.20 తీసుకోవాలి కాని ఇలా వంద చొప్పున అదనంగా పెంచి విక్రయాలు చేయడమేమిటని నిలదీసిన భక్తులకు న్యాయం జరగడం లేదు. దుకాణాదారుడు చెప్పిన ధరలకే మద్యం కొనాల్సి రావడంతో అధికారుల తీరుపై, జాతర నిర్వహణ, ప్రభుత్వంపై భక్తులు విమర్శలు గుప్పిస్తున్నారు.

### మేడారం భక్తులకు ఆర్టీసీ బిగ్‌షాక్!

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): మేడారం మహాజాతరకు వెళ్లే బస్సుల్లో కోళ్లు, గొర్రెలు, మేకలను భక్తులు తరలించడానికి అనుమతి లేదని సంస్థ టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మూగజీవాలను తరలించకుండా భక్తులు సహకరించాలని కోరారు. జాతరలో విధులు నిర్వహించే 15 వేల మంది ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికుల పట్ల సేవాభావంతో వ్యవహరించాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో తిరిగే 2,850 సిటీ బస్సుల్లో 2 వేల వరకు మేడారం జాతరకు వెళ్లనున్నాయి. దీంతో నగర ప్రజల ప్రయాణంపై ప్రభావం పడనున్నది.

### క్లీన్ మేడారం- సేవ్ మేడారం

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 19: హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో ఉన్న ఎన్ఎస్ఎస్‌లో క్లీన్ మేడారం-సేవ్ మేడారం పేరిట ముద్రించిన వాల్‌పోస్టర్, క్లాత్ బ్యాగ్‌లను సోమవారం ప్రపంచ పర్యావరణ సంస్థ గ్లోబల్ చైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ భద్ర ఆవిష్కరించారు. తాము ఉచితంగా లక్ష క్లాత్ బ్యాగ్‌లను భక్తులకు పంపిణీ చేస్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి, ప్రతినిధి మహేశ్ పాల్గొన్నారు.

### హైదరాబాద్, హనుమకొండ నుంచి హెలికాప్టర్ సౌకర్యం

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): మేడారం జాతరకు వెళ్లే ప్రయాణికులకు హెలికాప్టర్ సేవలు అందనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం, బెంగళూరు తుంబీ ఏవియేషన్ సహకారంతో హెలిటాక్సీ సంస్థ బుధవారం నుంచి ఈ నెల 25 వరకు ఈ సేవలను అందించనున్నది. మేడారంలో 7 నిమిషాలపాటు ఆకాశం నుంచి జాతరను వీక్షించేందుకు 'జాయ్ రైడ్'ను కూడా హెలిటాక్సీ ఏర్పాటు చేసింది. హనుమకొండ-మేడారం-హన్మకొండ షటిల్ సర్వీసుల్లో ఒక్కరికి రూ.28,999 చొప్పున టికెట్ ధర నిర్ణయించారు. మేడారంలో వీఐపీ దర్శనానంతరం తిరిగి హనుమకొండలో దింపుతారు. మేడారంలో ఏరియల్‌వ్యూ (జాయ్ రైడ్) కింద 7 నిమిషాలపాటు ఆకాశంలో తిప్పేందుకు ఒక్కొక్కరికీ రూ.4,300 తీసుకుంటారు. ఆరు సీట్ల సామర్థ్యం కలిగిన చాపర్‌లో హైదరాబాద్ నుంచి ఒక్కరికి రూ.95,833గా టికెట్ ధర నిర్ణయించారు. బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి హెలికాప్టర్ నడిచేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 7483432752, 9400399999 నంబర్లలో సంప్రదించాలని సంస్థ కోరింది.

## జాతర నిర్వహణకు 110 కోట్లు

**మంత్రులు పొంగులేటి, సీతక్క**

తాడ్వాయి, ఫిబ్రవరి19: రెండేండ్లకోసారి జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మల మహాజాతర ఏర్పాట్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.110 కోట్లు ఖర్చు చేస్తుందని రెవెన్యు, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి సీతక్క తెలిపారు. జాతరను అద్భుతంగా నిర్వహిస్తామని, భక్తుల కోసం సకల సౌకర్యాలు ఏర్పాటు చేశామని చెప్పారు. మంత్రి పొంగులేటి హెలికాప్టర్లో మేడారం చేరుకోగా, అప్పటికే మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్ ఏర్పాట్లలో ఉన్నారు. అనంతరం వనదేవతలు సమ్మక్క, సారలమ్మ దర్శనానికి మంత్రులు, జిల్లా అధికారులు చేరుకోగా, దేవాదాయశాఖ అధికారులు, పూజారులు ఘన స్వాగతంతో తల్లుల గద్దెల వద్దకు తీసుకువెళ్లారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి అమ్మవార్లకు ఎత్తుబెల్లం సమర్పించారు. గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గద్దెల ప్రాంగణంలో మీడియాతో మంత్రులు మాట్లాడారు. జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని మంత్రులు చెప్పారు. మహాజాతరలో భాగంగా అమ్మవార్లను దర్శించుకునేందుకు 2 కోట్ల మంది భక్తులు తరలివస్తారనే అంచనాలు ఉన్నాయని, అందుకు తగ్గట్టుగానే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. వీఐపీలు తమ వాహనాల్లో ములుగు వరకు వచ్చి అక్కడే పార్కింగ్ చేసి ఆర్టీసీ బస్సులోనే మేడారానికి రావాలని కోరారు. మహాజాతర పూర్తయిన తర్వాత ఖర్చులన్నీ ప్రజల ముందుంచుతామని, మిగతా సొమ్ముతో జాతరలో శాశ్వత నిర్మాణాలు చేపడుతామని తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, చిత్రంలో మంత్రి పొంగులేటి, కలెక్టర్ ఇలా త్రిపాఠి

## ఐఐటీహెచ్ నేడు జాతికి అంకితం

- వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ

సంగారెడ్డి ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా కంది లోని ఐఐటీ హైదరాబాద్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం వర్చువల్‌గా జాతికి అంకితం చేయనున్నారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, జపాన్ రాయబారి సుజుకి హిరోషి, జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సాచికో ఇమోటో, ఐఐటీ పాలకవర్గ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ బీఎస్ మూర్తి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రధాని ఆన్‌లైన్‌లో ప్రసంగించనున్నారు. నాలెడ్జ్ ర్యాంకింగ్‌లో దేశంలోనే ఐఐటీహెచ్ మూడో స్థానం, నిర్ఫ్ ర్యాంకింగ్‌లో 10 లోపు స్థానంలో ఉన్నది. ఐఐటీలో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీతోపాటు అనేక కొత్త కోర్సులను అందజేస్తున్నది. ఇక్కడ 4,800 మంది విద్యార్థులు, 300 మందికిపైగా ప్రొఫెసర్లు ఉన్నారు. ఐదు పరిశోధన కేంద్రాలు ఉన్నాయి.

## 'పెసా' నిబంధనల సవరణపై వివరణ ఇవ్వండి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 19, (నమస్తే తెలంగాణ): గిరిజన ప్రాంతాల్లో పంచాయతీ చట్టం (పెసా) నిబంధనలకు సవరణ తేవడంపై వివరణ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. సమగ్ర వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. 2019లో 'పెసా' నిబంధనలకు సవరిస్తూ జారీచేసిన జీవో 54కు వ్యతిరేకంగా లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా దేవనాయక్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని, దీనివల్ల గిరిజనుల సంప్రదాయాలు, హక్కులను పరిరక్షించేందుకు తీసుకొచ్చిన చట్టం నీరుగారిపోతుందని పటిషనర్ తరపు న్యాయవాది ఆందోళన వ్యక్తం చేయడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది.


